ఆదిబట్లలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అనుమతి లేదా.. ఇండ్లను కూల్చుడే..

● అక్రమ నిర్మాణాలను సహించం ● ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ

ఆదిబట్ల, మే 24 : అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని టీసీఎస్ సమీపంలో అక్రమంగా నిర్మించిన పది భవనాలను మున్సిపల్ సిబ్బందితో కూల్చివేయించారు. ఇప్పటికే మంగల్‌పల్లి, ఆదిబట్ల,కొంగరకలాన్, బొంగుళూరు, పటేల్‌గూడ తదితర గ్రామాల్లో అనుమతుల్లేకుండా నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీచేశామన్నారు. కొంతమంది పనులను నిలిపివేయగా.. మరి కొంత మంది గుట్టచప్పుడు కాకుండా నిర్మాణాలు చేపడుతున్నారని.. వాటిని కూడా కూల్చివేస్తామన్నారు. కార్యక్రమంలో టీపీవో, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బడుల్లో వసతులు కల్పించాలి

రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

పసుమాములలోని పాఠశాలను పరిశీలిస్తున్న రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి

పెద్దఅంబర్‌పేట, మే 24 : పాఠశాలలు ప్రారంభమయ్యే సమయం ఆసన్న మవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పరిశీలనలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధి పసుమాముల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె సందర్శించి జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడంతో.. మరో యూనిట్ మరుగుదొడ్డి నిర్మాణానికి, తాగునీరు, రెండుతరగతి గదుల్లో విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ డీఈఈ అశోక్‌కుమార్‌ను ఆదేశించారు. పాఠశాల ఆఫీస్ రూం రూఫ్ లీకేజీ అవుతుండడంతో మరమ్మతులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని కమిషనర్ రవీందర్‌రెడ్డిని ఆదేశించారు. ఆమె వెంట ఏఈ వీరాంజనేయులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సీఎంను కలిసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే

షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో చేపట్టనున్న అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపు వంటి విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా.. అవసరమైన నిధులను విడుదల చేయడంతోపాటు అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారిస్తామని సీఎం చెప్పినట్లు ఆయన వివరించారు.

– షాద్‌నగర్/షాద్‌నగర్ రూరల్, మే 24

'పట్నం' మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా మంగ

14 మంది కౌన్సిలర్ల మద్దతుతో ఎన్నిక ఏకగ్రీవం



బర్ల మంగకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్డీవో

ఇబ్రహీంపట్నం, మే 24 : ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా బర్ల మంగాజగదీశ్‌యాదవ్ ఎన్నికయ్యారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం జరిగింది. దీనికి 14 మంది కౌన్సిలర్లు హాజరై బర్ల మంగకు మద్దతు తెలుపడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్డీవో అనంతరెడ్డి ప్రకటించారు. గతంలో మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న ఆకుల యాదగిరిపై ఇబ్రహీంపట్నానికి చెందిన కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో ఆయన వైస్ చైర్మన్‌కు రాజీనామా చేశారు. అనంతరం నిర్వహించిన అవిశ్వాస తీర్మానమూ నెగ్గడంతో వైస్ చైర్మన్ సీటు ఖాళీ అయ్యింది. దీంతో ఎన్నిక నిర్వహించగా.. 22వ వార్డు కౌన్సిలర్, తెలంగాణ ఉద్యమకారుడు బర్ల జగదీశ్ సతీమణి బర్ల మంగ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. ఎన్నిక సందర్భంగా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తా

ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్న పట్టణ ప్రజలు, కౌన్సిలర్లకు ధన్యవాదాలు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అభివృద్ధికి నా వంతు కృషిచేస్తా. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి సమస్యలను చైర్‌పర్సన్‌తో కలిసి పరిష్కరిస్తాం.

– బర్ల మంగాజగదీశ్‌యాదవ్

ముగిసిన అవిశ్వాసాల పర్వం..

ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో గత ఆరు నెలలుగా అవిశ్వాస తీర్మానాల పరంపర కొనసాగుతున్నది. ముందుగా మున్సిపల్ చైర్‌పర్సన్‌పై బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లతో పాటు కొందరు కాంగ్రెస్ కౌన్సిలర్లు కలిసి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అవిశ్వాస సమావేశానికి రెండు రోజుల ముందు ఇద్దరు కౌన్సిలర్లు క్యాంపు నుంచి తప్పించుకుని చైర్మన్‌కు మద్దతు ప్రకటించటంతో అవిశ్వాసం వీగిపోయింది. ఈ తీర్మానం ప్రవేశపెట్టడంలో వైస్‌చైర్మన్ కీలకపాత్ర పోషించాడన్న కారణంతో చైర్‌పర్సన్ వర్గీయులు వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా నెగ్గడంతో ఆయన పదవి కోల్పోయారు. ప్రస్తుతం వైస్ చైర్‌పర్సన్ ఎన్నికతో అవిశ్వాసాల పర్వం ముగిసినట్లయింది.

బ్రిడ్జి పనులను త్వరగా పూర్తి చేయాలి

సీపీఎం ఆధ్వర్యంలో వంతెన వద్ద నిరసన

అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం, మే 24 : ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ శ్రీఇందు కళాశాల వద్ద అసంపూర్తిగా ఆగిన వంతెన నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని సీపీఎం ఆధ్వర్యంలో బ్రిడ్జి వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. దీంతో హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారిపై గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవ డంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఆగిన వంతెనపై అవస్థలు అనే శీర్షికతో ఈనెల 22 తేదీన నమస్తేతెలంగాణ దినపత్రికలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు సామెల్ మాట్లాడుతూ.. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించినా పనులను అసంపూర్తిగా వదిలిపెట్టారని.. వాటిని పూర్తి చేయించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుసార్లు విన్నవించామని ఫలితం లేదన్నారు. వెంటనే రోడ్లు, భవనాల శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పందించి వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయించాలని కోరారు. బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలోనే ఆగిపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని.. అంతేకాకుండా ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ జాం అవుతున్నదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జంగయ్య, నాయకులు ఎల్లేశ్, వెంకటేశ్, శంకర్, వీరేశ్, యాదగిరి, నర్సింహ, స్వప్న, దేవరాజు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సురంగల్‌లో గొర్రెకు టీకా వేస్తున్న సిబ్బంది.. పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి విజయ్‌కుమార్‌రెడ్డి

జీవాలకు టీకాలు వేయించాలి

మొయినాబాద్, మే 24 : ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రెండు రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లోని జీవాలకు చిటిక వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం సురంగల్‌లో జరుగుతు న్న టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. జీవాలు ఉన్న ప్రతి రైతూ చిటిక వ్యాధి నివారణ టీకాలను జీవాలకు వేయించాలన్నారు. ముం దస్తూ టీకాలు వేయించడం వల్ల వర్షాకాలంలో వచ్చే రోగాలను నివారించొచ్చ న్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీలతారెడ్డి, సిబ్బంది భీమ్ పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన మస్ట్

మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం, మే 24 : పోలీసులకు నూతన చట్టాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం పరిధిలోని గురునానక్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నూతన చట్టాలపై పోలీసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జూలై 1 నుంచి భారత ప్రభుత్వం నూతన నేర న్యాయ చట్టాలు–2023ను అమల్లోకి తీసుకొస్తున్న నేపథ్యంలో పలు రకాల కేసుల దర్యాప్తు, కేసుల విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై పోలీసులకు పూర్తిస్థాయి పరిజ్ఞానం ఉండాలన్నారు. నూతన చట్టాలతో దేశ అంతర్గత భద్రతలో నూతన అధ్యాయం ప్రారంభం కానుందని ఆమె పేర్కొన్నారు. సిబ్బందితో నూతన చట్టాలకు సంబంధించిన అంశాలపై ప్రతి పోలీస్‌స్టేషన్‌లోనూ అంతర్గత శిక్షణ కార్యక్రమాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ నూతన చట్టాలపై జోన్ల వారీగా సమీక్ష కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు, నియోజకవర్గ పరిధిలోని పలువురు సీఐలు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు

విత్తన మేళాలో తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుధారాణి

విత్తన మేళాలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తాండూరు, మే 24: పంటల సాగులో నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు వస్తాయని తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సి.సుధారాణి పేర్కొన్నారు. శుక్రవారం తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో విత్తనమేళా, నూతన వంగడాల లక్షణాలు వాటి గుణగణాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ సి.సుధారాణి, డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ రైతులు ఆధునిక పద్ధతితో వ్యవసాయం చేస్తే అధిక లాభాలు వస్తాయన్నారు. జంట సాగు పద్ధతిలో కందిని సాగు చేస్తే దిగుబడులు బాగుంటాయని సూచించారు. విత్తనాల్లో నాణ్యత, జన్యు స్వచ్ఛత ఏ విధంగా గుర్తించాలో తెలిపారు. జన్యుపరమైన భౌతిక స్వచ్ఛత కలిగిన విత్తనాలను వాడడం వల్ల పది నుంచి పదిహేను శాతం అధిక దిగుబడి వస్తుందన్నారు. కందిలో అంతర్ పంటలుగా పెసర, మినుము, కొర్రలు, సోయాబీన్ సాగు చేసుకుంటే మంచిదన్నారు. తాండూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో తెలంగాణ కంది–3 (టీడీఆర్‌జీ–59), ఆశ (ఐసీపీఎల్ 87119) కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కేజీ 130 చొప్పున 4 కేజీల కంది విత్తనాల బస్తా రూ.520 ధర ఉన్నదన్నారు. రైతులకు సందేహాలు ఉంటే శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు సుజాత, యమున, శేఖర్, రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

సాంకేతికతతోనే కొత్త డ్రగ్స్ ఆవిష్కరణను అనుమతించొచ్చు

డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్ సీఈవో దీపక్ సుప్రా

మాదాపూర్, మే 24: సాంకేతికత ఆధారంగా వేగంగా, సమర్థవంతంగా, తక్కువ ధరకు కొత్త డ్రగ్స్ ఆవిష్కరణను అనుమతించొచ్చని డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్ సీఈవో దీపక్ సుప్రా అన్నారు. శుక్రవారం మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన డీఎక్స్ఎం–2024 కార్యక్రమానికి ఆయన సీఐఎం డేటా సీఈవో, అధ్యక్షుడు పీటర్‌బిలెల్లోతో కలిసి హాజరై.. మెషిన్ లెర్నింగ్ వంటి అనేక నూతన తరంగాల సాంకేతికతతో, ఔషధ, మాలిక్యూలర్ డేటా రెండింటిలోనూ విస్తృతమైన డేటాను స్వయం చాలకంగా సంక్లిష్ట నమూనాలను రూపొందించేందు కు ఉపయోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ తరహా ప్రక్రియ ఆవిష్కరణను మరింత సులభతరం చేయనుండడంతోపాటు శరీరంలో మందులు ఏ విధంగా పనిచేస్తాయో అంచనా వేసేందుకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. డ్రగ్స్ ఆవిష్కరణ చాలా క్లిష్టమైన వ్యవహారమని, దీనికి 10 నుంచి 15 సంవత్సరాల సమయం పట్టడంతోపాటు చాలా ఖర్చు అవుతుందన్నారు. మన ఆరోగ్య సంరక్షణ మొబైల్ ఫోన్‌లో ఉండడం, అతిపెద్ద డయాగ్నస్టిక్ పరికరం మన మొబైల్ అని పేర్కొన్నారు. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ఉన్న రోగులకు రోగనిర్ధారణ, చికిత్స ఎంపికలో వైద్యులకు సహాయం చేసేందుకు రూపొందించబడిందని చెప్పారు. వ్యాధుల ను నిర్ధారించడంలో వైద్యులకు సహా యం చేస్తుందన్నారు. ఇద్దరు రోగుల డే టాపై పనిచేసే విప్లవాత్మక ఉత్పత్తులు యూజర్ ఫ్రెండ్లీ కానందున విఫలమైన ట్లు తెలిపారు. పాశ్చాత్య దేశాల్లోనే కాకుం డా భారతదేశంలోనూ వ్యక్తీకరించిన మందులపై పరిశోధన జరుగుతున్నట్లు వివరించారు. క్లినికల్ ట్రయల్స్ ఉపయోగించే జంతువుల అనుకరణ మోడ్‌ల ద్వారా భర్తీ చేయొచ్చన్నారు. ఇటీవలి అధ్యయనాల ప్రకారం.. తయారీలో డిజిటలైజేషన్‌ను స్వీకరించడం వల్ల 2025 నాటికి భారతదేశ జీడీపీకి 1.04 ట్రిలియన్ డాలర్లు జోడించవచ్చని పేర్కొన్నారు. ఇది ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ప్రోత్సాహాన్ని సూచిస్తుందన్నారు. దక్షిణ కొరియా తన లాభాల్లో 5.2 శాతం ఆర్‌అండ్‌డీ కోసం ఖర్చు చేస్తుండగా.. భారత్ కేవలం 0.8 శాతం ఖర్చు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యనిపుణులు, యువ వైద్యులు పాల్గొన్నారు.

ఆ స్కూల్ బస్సులు అన్‌ఫిట్

గ్రేటర్‌లో మొత్తం 11,854 బస్సులు

4,500 బస్సులు ఫిట్‌నెస్‌కు పరీక్షలు పూర్తి

అందులో 20శాతం బస్సులు అన్‌ఫిట్

కొనసాగుతున్న స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షల డ్రైవ్

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ) : మరి కొన్ని రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానుండడంతో రవాణా శాఖ అధికారులు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించారు. ఫిట్‌నెస్‌పై ప్రత్యేక టీంలు తనిఖీ ప్రక్రియ చేపట్టాయి. గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల రవాణా శాఖ పరిధిలో 11,854 విద్యాసంస్థల బస్సులున్నాయి. వీటిలో ఇప్పటి వరకు 4,500 విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష పూర్తయింది. ఇందులో 20శాతం బస్సులు నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతో అధికారులు అన్‌ఫిట్‌గా తేల్చేశారు. విద్యాసంస్థల బస్సులు నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించరాదని విద్యా సంస్థల యాజమాన్యాలకు సూచిస్తున్నారు.

గ్రేటర్‌లో విద్యాసంస్థల బస్సులు	
హైదరాబాద్	-2,234
రంగారెడ్డి	-5,500
మేడ్చల్	-4,120

ఇవి పాటించాల్సిందే..!!

- మోటర్ వాహనాల చట్టం ప్రకారం స్కూల్ బస్సు తప్పక పాటించాల్సిన నియమాలు కొన్ని ఉన్నాయి. 1.రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్‌సీ), 2.వ్యాలీడ్ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, 3.వ్యాలీడ్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, 4.పర్మిట్, 5.ట్యాక్స్ పేమెంట్ రసీదు(బకాయిలు లేకుండా), 6.పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్, 7.డ్రైవింగ్ చేసే డ్రైవర్ లైసెన్సు తప్పక వాహనంతో ఉండాలి.
- ప్రభుత్వ సూచనల మేరకు ఐదు రకాల వాహనాల వేగానికి కళ్లెం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటిలో విద్యాసంస్థల బస్సులు కూడా ఉన్నాయి. ఫిట్‌నెస్‌కు ముందే ఆయా వాహనాల్లో వేగ నియంత్రణ పరికరాలు ఉండేల చూడాల్సి ఉంటుంది.
- తెలంగాణ మోటర్ వెహికల్ రూల్స్ 1989 ప్రకారం రూల్ నంబర్ 186జీ ప్రకారం తెలంగాణలో విద్యాసంస్థల బస్సులు పూర్తి పసుపు రంగులో ఉండాలి. ఆ బస్సుపై పెద్ద అక్షరాలతో స్కూల్ బస్సు అని రాయడం తప్పనిసరి.
- వాహనం డ్రైవర్ 60 సంవత్సరాలకు మించి ఉండరాదు. డ్రైవర్‌కు సంబంధించిన ఆరోగ్య వివరాలు బస్సులో అతికించాలి.
- కనీసం ఐదు సంవత్సరాలు డ్రైవింగ్ అనుభవం ఉండాలి.
- వాహనంలో ఫిర్యాదుల పట్టికను ఏర్పాటు చేసి ఫిర్యాదులను ప్రతి నెలకు ఒకసారి పరిశీలించాలి.
- ప్రతి వాహనంలోనూ అత్యవసర ద్వారం పెట్టాలి. పెద్ద అక్షరాలతో రాయించాలి. వాహనంలో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలి.
- ప్రతి బస్సులోనూ విద్యార్థుల పేర్లు, ఇంటి చిరునామా, తరగతులు, దిగాల్సిన ప్రదేశం పేర్ల పట్టికతో పాటు రూట్ మ్యాప్ తప్పని సరి ఉండాలి.
- విద్యార్థులు బస్సును ఎక్కడం, దిగడం విషయాన్ని గ్రహించేందుకు కన్వెస్ట్ క్రాస్ అద్దాలుండాలి. ప్రతి బస్సులో కూర్చున్న విద్యార్థులు డ్రైవర్‌కు కన్పించేలా పెద్ద అద్దం పెట్టాలి.
- బస్సులు సీట్ల కింద విద్యార్థుల బ్యాగులు పెట్టునేందుకు అరలు ఏర్పాటు చేయాలి.
- రవాణా శాఖ ఇచ్చే శిక్షణలో డ్రైవర్ పాల్గొనాల్సి ఉంటుంది. సంవత్సరానికి ఒకసారి విద్యార్థులచే రోడ్ సేఫ్టీ డేను నిర్వహించాలి.

ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుంది

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించాం. స్కూల్ బస్సుల వివరాలను ఆర్టీఏ కార్యాలయాల్లో అందజేయాలి. విద్యాసంస్థల బస్సులు ఫిట్‌నెస్ చేయించుకోవాలి. నిబంధనల ప్రకారం అన్ని సౌకర్యాలు ఉండాల్సిందే. నిబంధనలు పాటించి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలి. ఫిట్‌నెస్ లేకున్నా.. అర్హత లేని డ్రైవర్లను నియమించుకున్నా కఠిన చర్యలు తప్పవు. ముఖ్యంగా సాంకేతికంగా చాలా జాగ్రత్తగా ఉండాలి. యాంత్రికంగా చూస్తే ఇంజిన్, గేర్ బాక్సు, క్లచ్, స్టీరింగ్ పనితీరు సక్రమంగా ఉందో..? లేదో..? పరిశీలించుకోవాలి. వాటిలో ఎలాంటి లోపాలు ఉండకూడదు. ఎలక్ట్రికల్ విషయాల్లో బ్యాటరీ, వైపర్స్, రెండు వైపుల ఇండికేటర్లు పకడ్బందీగా పనిచేయాలి. యాజమాన్యాలు డ్రైవర్ వివరాలు పేరేంట్స్‌కు తెలిసేల ఉంచాలి. ఫిట్‌నెస్ చేయని వాహనాలు రోడ్డెక్కితే సీజ్ చేస్తాం.

-సి.రమేశ్, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, హైదరాబాద్

ఎంపీఈడీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 24: ఓయూ పరిధిలోని మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఎంపీఈడీ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 13 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవవాలని సూచించారు.

'లా'లో బ్యాక్‌లాగ్ ఉన్నవారికి వన్‌టైమ్ చాన్స్

ఓయూ పరిధిలోని లా కోర్సు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్‌టైమ్ చాన్స్ కల్పించినట్లు అధికారులు తెలిపారు. 2వేల సంవత్సరం తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చారు. మూడేండ్ల ఎల్ఎల్‌బీ, ఐదేండ్ల ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం తదితర కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్ష ఫీజును వచ్చే నెల 20లోపు, రూ.500 అపరాధ రుసుముతో కలిపి 27 తేదీలోపు చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలు జూలై, ఆగస్టులో నిర్వహించనున్నట్లు తెలిపారు.

హాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ

కాచిగూడ,మే 24: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో కంప్యూటర్ శిక్షణ, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హాకింగ్ కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ కోసం తెలంగాణ వ్యాప్తంగా ఆసక్తి గల యువతి, యువకుల నుంచి దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీమాన్‌రెడ్డి తెలిపారు. ఇన్ఫర్మేషన్ రంగం, ఆర్కిటెక్ట్, సెక్యూరిటీ విభాగం, మిషన్ లెర్నింగ్, బిజినెస్ అనలిస్ట్, పైథాన్, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటర్, జావా, ఒరాకిల్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వన్నుట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, డిప్లొమా, పీజీ, ఇంజినీరింగ్ చదివిన యువకులు జూన్ 6 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 95058 00050 ను సంప్రదించాలని సూచించారు.

3 నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): జూన్ 3 నుంచి 13 వరకు టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు హైదరాబాద్ డీఈవో రోహిణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలో 35 కేంద్రాల్లో 12,186 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.